డిఇఒ రామకృష్ణారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖ అధికారిగా కే రామకృష్ణారావు ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన గురువారం పాడేరు జిల్లా కేంద్రంలోని తన కార్యాలయానికి హాజరై బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పాడేరు మండల విద్యాశాఖ అధికారులు ఎం.జాన్ సరస్వతి తోపాటు పలు మండలాల నుంచి ఎంఈఓ లు ఉపాధ్యాయ సంఘ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు స్వాగతం పలికారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న డిఇఒ

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

- సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అల్లూరి సీతా రామరాజు జిల్లా అరకులోయ మండలంలోని బస్కి గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగానికి గురయ్యాయంటూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం బస్కి సచివాలయం వద్ద గిరిజనులు ధర్నా చేపట్టారు. అనంతరం డిఏ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, మాజీ ఎంపిటిసి బురిడీ దశరథ్ మాట్లాడుతూ, బస్కి పంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేటాయించిన సుమారు రూ.31 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీ పాలకవర్గం దుర్వినియోగం చేసిందని తెలిపారు. ఈ మేరకు నవంబర్ 5న గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆధారాలతో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు ఎటువంటి విచారణ ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకపోతే సచివాలయం ఎదుట నిరహార దీక్ష చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో క్లాఫ్ మిత్ర కిల్లో అర్జున్, డొంబు దొన్ను, పేసా కార్యదర్శి కొర్రా దేవన్న, సుబ్బారావు, కన్నయ్య, నవీన్, రామన్న, రాంబాబు, అప్పలరాజు, కామేశ్, గురుమూర్తి, ఈశ్వరరావు, కోగేష్, దాసు, దాసు బాబు, కుమార్, నాగేశ్వరరావు, నర్సింగరావు, కిరణ్, జగబందు, మొస్య, జయరాం, బలరం, భీష్మ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, గిరిజనులు

ముగిసిన డిజిటల్ ఎడ్యుకేషన్ సెమినార్

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ యం.విజయభారతి ఆధ్వర్యంలో పి.యం. ఉష స్కీమ్ సహకారంతో "డిజిటల్ ఎడ్యుకేషన్ పాలసీ ఇంప్లికేషన్ ఇన్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ: ప్రాస్పెక్ట్స్ ఛాలెంజెస్" అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి సెమినార్ ఘనంగా ముగిసింది. సెమినార్‌లో భాగంగా విడుదల చేసిన ప్రొసీడింగ్స్ పుస్తకం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. డిజిటల్ ఎడ్యుకేషన్ రంగంలో తాజా పరిశోధనలతో పాటు విధానాల అమలు, భవిష్యత్ అవకాశాలు, సవాళ్లను సమగ్రంగా చర్చించిన ఈ పుస్తకాన్ని విద్యావర్గాలు అభినందించాయి.కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ శర్మ వి.ఎస్. వేలూరి కీలకోపన్యాసంలో డిజిటల్ శిక్షణా విధానాల రూపకల్పన, ఎన్ఈపీలో సాంకేతిక వినియోగంపై విశదీకరించారు. అనంతరం జి.డి.సి నందికొట్కూరుకు చెందిన కామర్స్ లెక్చరర్ డాక్టర్ పరిమళాదేవి, క్లస్టర్ విశ్వవిద్యాలయం కర్నూలులోని కె.వి.ఆర్ డిగ్రీ కళాశాల మాథమెటిక్స్ లెక్చరర్ డాక్టర్ టీ.సునీత చేత సెమినార్ ప్రొసీడింగ్స్‌ను ఆవిష్కరించారు రెండు రోజుల పాటు పలువురు పరిశోధకులు డిజిటల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన తమ పరిశోధన పత్రాలను సమర్పించగా, వినూత్న ఆలోచనలు, ఉపయోగకరమైన సూచనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మినిమల శ్రీనివాస్ పాత్రుడు, పి.యం. ఉష కోఆర్డినేటర్ డాక్టర్ వి. రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలను చూపుతున్న అధ్యాపకులు

కట్టడాన్ని పరిశీలిస్తున్న విఆర్ఓ

అక్రమ కట్టడంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో ఎంపీడీవో క్వార్టర్స్ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న విషయంపై స్థానిక వీఆర్వో సిహెచ్ రమేష్ కుమార్‌కు గురువారం స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆయన తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణ స్థలాన్ని పరిశీలించి అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలని హెచ్చరించారు. ఈ విషయంపై స్థానిక విఆర్ఓ మాట్లాడుతూ, స్థానికుల ఫిర్యాదు మేరకు అక్రమ నిర్మాణ స్థలాన్ని పరిశీలించి కట్టడాలను నిలుపుదల చేయాలని హెచ్చరించినట్లు తెలిపారు.

నేడు ప్రజావాణి

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని 24 పంచాయతీల పరిధిలో నెలకొన్న వివిధ మౌలిక వసతి సమస్యలపై ఈనెల12న మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి ఏర్పాటు చేస్తున్నట్లు అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం ఆర్టీసీ రీజినల్ జోనల్ అధికారి సియారి .దొన్నుదొర పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశం మేరకు ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే ఈ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలి

ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి-మారేడుమిల్లి, వై.రామవరం : ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజు మెనూ అమలు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మారేడుమిల్లి మండలం కోడూరు బొడ్లంక గ్రామాలు, వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని ధారగడ్డ, గుర్తేడు తదితర గ్రామాల్లో ప్రాజెక్ట్ అధికారి పర్యటించారు. మారేడుమిల్లి మండలం కోడూరు గ్రామంలో పీఎం జన్మన్ పథకం ద్వారా మంజూరైన గృహాలు ఏ విధంగా కడుతున్నదీ ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. నీటి కుంటలను పరిశీలించారు. బొడ్లంక గ్రామంలో పసుపు ప్రాసెస్ చేసే పరికరం మరమ్మతులు చేయించాలని మహిళా సంఘాలు ప్రాజెక్ట్ అధికారికి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఆయన మరమ్మతులు చేయించుటకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. బొడ్లంక సిడిఆర్ వ్యవసాయ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి ఈ కేంద్రంలో రైతులకు ఏపే శిక్షణ ఇస్తున్నదీ ఆరా తీశారు. ఏయం కోట గ్రామంలో పసుపు రైతుల సమస్యలను తెలుసుకున్నారు. గుర్తేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. గుర్తేడు గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను, ధారగడ్డ గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. మెనూ అమలుపై తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు విద్యను బోధించాలని సూచించారు. తంగేడు కోట నుండి రోడ్డు ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు తయారుచేసి నివేదికల సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.బాపన్న దొర, డిప్యూటీ ఇంజనీర్ చైతన్య, దుర్గాప్రసాద్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజాశక్తి-చింతూరు : సూపర్ సిక్స్ హామీలంటూ అధికారంలోకి వచ్చి హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం చింతూరులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన నిరుద్యోగభృతి, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో రంపచోడవరం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ముంపు మండలాల్లో వరదలు సంభవిస్తే ప్రభుత్వ పరంగా అన్నివిధాలా అదుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే వరదల సమయంలో బాధితులను పట్టించుకోలేదని, ప్రభుత్వం నుండి సరైన సాయమూ అందేలా చూడలేదని ఆరోపించారు. 2022 వరదలను దృష్టిలో వుంచుకుని అప్పటి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చింతూరుతో సహా 32 గ్రామాలను ప్రాధాన్యతా క్రమంలో చేర్చి పరిహారం అందేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రతిపక్షంలో వున్నా, అధికారంలో వున్నా నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరిగిందని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ధనలక్ష్మి పిలుపునిచ్చారు. దీనికోసం గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం ఆమల, వైస్ ఎంపీపీలు యడమ ఆర్జున్, మేడేపల్లి సుధాకర్, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జిక్రియా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, నాయకులు కోట్ల కృష్ణ, పార్టీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

బస్కిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అల్లూరి జిల్లా లోని అరకులోయ మండలం బస్కి పంచాయితీ కేంద్రంలో జరగబోయే శ్రీరామ ఉయ్యాల పండగను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్కి ప్రీమియల్ లీగ్ (బిపిఎల్) క్రికెట్ టోర్నమెంట్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 60 జట్లు పాల్గొంటున్నట్లు మేనేజ్మెంట్ ప్రకటించింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ, జనవరి నెలలో జరిగే శ్రీ రామ ఉయ్యాల పండగ ప్రతి ఏడాదికి ఒక్కసారే జరుగుతుందని, ఈ పండగను చూడటానికి వివిధ ప్రాంతాల నుండి వేలాదిమంది వస్తారని తెలిపారు. 150 అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా ఊరేగించే ఉయ్యాల కార్యక్రమం ప్రధాన ఆకర్షణగా ఉంటుందని చెప్పారు. రాత్రి వేళల్లో గిరిజన సాంప్రదాయ బుడ్డియా, నెమలి, జంతు నృత్యాలు, సహా 12 రకాల గిరిజన కళారూపాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. బిపిఎల్ మెగా టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించాలని, వివిధ ప్రాంతాల నుండి చేరుకున్న క్రీడాకారులకు రామారావు సూచించారు.ఈ కార్యక్రమంలో బిపిఎల్ మేనేజ్మెంట్ టీమ్ సభ్యులు, కెప్టెన్ వంతల నాని, ఆదివాసి పరిరక్షణ సమితి అధ్యక్షుడు చట్టు మోహన్, పాంగి బాబురావు, సమర్ధి బుజ్జిబాబు, కళ్యాణ్, సమర్ధి కృష్ణమూర్తి, సమర్ధి సభాపతి, సమర్ధి లైచొన్, ఆనంద్, కిల్లో రాందాస్, కొర్రా అప్పారావు, కొర్రా నీలకంఠం, వంతల అర్జున్, కొర్రా బాలి, గొల్లోరి లైకోన్, కిల్లో డొంబు తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

21న అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-చింతూరు : ఉమ్మడి భద్రాచలం డివిజన్ పరిధిలో ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యాన ప్రాణాలను త్యాగం చేసిన అమరజీవుల సంస్మరణ సభ డిసెంబర్ 21న చింతూరులో జరుగుతుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ తెలిపారు. ఈ సంస్మరణ సభలో అత్యధిక మంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మండలంలోని మధుగూరు గ్రామంలో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీసం సురేష్ మాట్లాడుతూ 40ఏళ్ళు గా ఈ ప్రాంతంలో సిపిఎంగా ప్రజా సమస్యలపైనా, వెట్టి చాకిరీ, బీపీఎల్ కూలీ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసి పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. కామ్రేడ్ బత్తుల భీష్మరావు, బండారు చంద్రరావు, పులి రామయ్య, పత్రా ముత్యం, మడకం గంగారాజు, కుంజా సీతారామయ్య, బ్రహ్మయ్య ఇలా అనేక మంది ఆనాడు నక్సల్స్ చేతిలో హత్య గావించబడ్డారని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధులుగా ఈ ప్రాంత అభివృద్ధికి పాటుబడిన మాజీ ఎమ్మెల్యేలు కుంజ బొజ్జి, సున్నం రాజయ్య, వేక అప్పారావు, సవలం సీతారామయ్య, ఎడమ రామయ్య అనేకమంది అమరజీవులు ఉన్నారని తెలిపారు. అమరులు త్యాగాలను స్మరిస్తూ చింతూరులో జరిగే అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేసే బాధ్యత సిపిఎం సభ్యులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కారం సుబ్బారావు, కారం మనోజ్, వినోద్, సీతారామయ్య, భారతి, భద్రమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

-టిడిపి అడ్వైజర్లు నరసింహమూర్తి, నిర్మల

మాట్లాడుతున్న అడ్వైజర్లు

ప్రజాశక్తి-చింతపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పసుపు పతాకాన్ని ఎగుర వేయాలంటే బూత్ స్థాయి నుంచే పటిష్ఠ వ్యూహాలు సిద్ధం చేయాలని టిడిపి నాయకులు సూచించారు. చింతపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో టీడీపీ పార్టీ అడ్వైజర్ గాలి నరసింహమూర్తి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజర్ నిర్మల పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పార్టీ తరఫున పరిష్కరించే ప్రయత్నాలు చేపట్టాలన్నారు. ఇంటింటా తిరిగి పార్టీ పట్ల నమ్మకాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం టిడిపి ప్రభుత్వం చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తదేనని అన్నారు. గ్రామ స్థాయిలో పార్టీకి అనుకూల వాతావరణం నెలకొల్పేందుకు కొత్త చేరికలు కీలకమని, రాబోయే రోజుల్లో పెద్దఎత్తున చేరికలు జరగేలా నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి కోరాబు గాంధీ పడాల్, నాయకులు మంగ్లు, అప్పారావు, చిన్నబాబు, శేఖర్, జర్ర కోటేశ్వరరావు, ముత్యం సత్యనారాయణ, వంతల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎపి జెన్‌కో ఎస్‌ఇలు బాధ్యతల స్వీకరణ





బాధ్యతలు స్వీకరించిన ఎస్ఇలు హనుమ, జాకీర్ హుస్సేన్‌లను సత్కరిస్తున్న ఎపి జెన్‌కో ఉద్యోగులు

ప్రజాశక్తి -సీలేరు : సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్‌గా జాకీర్ హుస్సేన్, ఏపీ జెన్కో పంపు స్టోరేజ్ ఎస్ఈగా హనుమ గురువారం స్థానిక ఎస్ఈ సివిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పంపు స్టోరీ ఎస్ఈ, ఇన్చార్జి ఎస్ఈ సివిల్‌గా కొనసాగిన చంద్రశేఖర్ రెడ్డి గతనెల 30న ఉద్యోగ విరమణ చేశారు. నెల్లూరు కృష్ణపట్నం పవర్ ప్లాంట్‌లో ఈఈగా విధులు నిర్వహిస్తున్న జాకీర్ హుస్సేన్ ఉద్యోగోన్నతిపై ఎస్ఈ సివిల్‌గా సీలేరుకు బదిలీ చేస్తూ జెన్కో అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న హనుమకు ఉద్యోగోన్నతి కల్పించి సీలేరు పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకి నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇరువురు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ జెన్కో ఎకౌంటు ఆఫీసర్ ఇవివి సత్యనారాయణ పంపు స్టోరీ ప్రాజెక్టు ఈఈ భాస్కర్‌రావు, ఇన్చార్జి ఈఈ క్యాంపు జైపాల్, ఏడిఈ అప్పలనాయుడు, ఎఇఇలు సిహెచ్ సురేష్, అనుదీప్, ఏపీ జెన్కో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పుష్పగుచ్ఛాలు అందజేసి సాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వేతనాలు చెల్లించాలి

పారిశుధ్య కార్మికుల వేడుకోలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: తమకు బకాయి పడ్డ వేతనాలు చెల్లించి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని గురువారం పారిశుద్ధ్య కార్మికులు లైకోన్, జగన్నాథం, ఇడ్డిక, సుభాష్, నింది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికులు లైకోన్, జగన్నాథం మాట్లాడుతూ కించాయిపుట్టు గ్రామ సచివాలయ కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులు గత మూడు నెలలుగా వేతనం లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొం టున్నామన్నారు. బకాయి పడ్డ వేతనాలు చెల్లించక పోవడంతో కుటుంబ పోషణకు కష్టాతరమవు తుందని తెలిపారు. మండల అభివృద్ధి శాఖ అధికారి, పంచాయతీ సెక్రటరీ, సంబంధిత జిల్లా ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని కోరారు.

పారిశుధ్య కార్మికులు

దళారీలను నమ్మి మోసపోకండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రైతులు ధాన్యాన్ని విక్రయించడంలో దళారీలను నమ్మి మోసపోవద్దని వ్యవసాయ శాఖ అధికారి చక్రధర్ అన్నారు. తూకం, ధరలో మోసపోవద్దని సూచించారు. రాజవొమ్మంగి మండలంలో శరభవరం, రాజవొమ్మంగి, దూసరపాము, లబ్బర్తి, జడ్డంగి, కొమరాపురం రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. క్వింటా ఏ గ్రేడ్ రకం రూ.2,389 కాగా, సాధారణ రకం రూ.2,369గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం జరిగిందని తెలిపారు. ధాన్యం పంపిన 24 గంటల్లో రైతు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయని ఏవో వివరించారు.

ధాన్యం కొనుగోలు చేస్తున్న అధికారులు

భాషా పండిట్ల ఉద్యోగోన్నతులపై హర్షం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో బోధిస్తున్న భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టిడబ్ల్యూటియు రాష్ట్ర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సూర్యనారాయణ, జి.శేషగిరిరావు, పాడేరు మండల శాఖ కార్యదర్శి ఒ.విజేంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘ కాలంగా పదోన్నతి లేకుండా ఒకే కేడర్‌లో పని చేస్తున్న 417 భాషా పండితులకు సర్కార్ నిర్ణయం ఎంతో మేలు చేస్తుందన్నారు. చాలాకాలంగా ఎదురు చూస్తున్న పదోన్నతులు లభించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి

పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: స్థానిక పోలీస్ స్టేషన్లో డిఎస్‌పి షహబాజ్ అహ్మద్ గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆయన స్టేషన్లోని వివిధ విభాగాలను సందర్శించారు. స్టేషన్లో అన్ని రకాల కేసుల దర్యాప్తు,పురోగతి పై ఆరా తీశారు. పెండింగ్ లో ఉన్న కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జి మాడుగుల సిఐ శ్రీనివాసరావు, ఎస్సై షణ్ముఖరావు పాల్గొన్నారు.

పదవులు రాలేదని కార్యకర్తలలో ఆవేదన : నాగబాబు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వంలో ఉన్నప్పటికీ జనసేనలో ఎంతో కాలంగా పనిచేస్తున్నా పదవులు రాలేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తపరచడం యదార్థమని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అన్నారు. జనసేన విశాఖ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జగదాంబ జంక్షన్ సమీపంలోని అంబికా బాగ్ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉండటం వల్ల అవకాశాలు పొందటంలో హెచ్చుతగ్గులు ఉండవచ్చన్నారు. జనసేన లేకపోతే ఈరోజు రాష్ట్ర రాజకీయాలు లేవు అనే విధంగా పార్టీ ఎదిగిందని చెప్పారు. ఉత్తరాంధ్రలో జనసేన పార్టీని బలోపేతం చేయాలని దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఎచ్చెర్ల నుండి ప్రతి నియోజకవర్గంలోనూ తాను పర్యటిస్తున్నానన్నారు. పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తామని చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్పొరేషన్ ఎన్నికలు రానున్నాయని, జనంలో బలంగా ఉన్నప్పుడు మాత్రమే మనం గెలిచే అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, కందుల నాగరాజు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఎ.రెహమాన్ పాల్గొన్నారు.

రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో రెవెన్యూ శాఖలో అంతులేని అక్రమాలు చోటు చేసుకున్నాయని, అధికారుల అలసత్వం కూడా అదే స్థాయిలో ఉందని వీటిని తొలగించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. లోక్‌సత్తా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రెవెన్యూ రికార్డుల్లో తప్పులు, రీ సర్వేలో జరిగిన పొరపాట్లు, పట్టాదారు పాస్ పుస్తకం, మ్యూటేషన్‌తో పాటు ప్రతి చిన్న పనికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగలేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. భూముల ధరలు పెరగటంతో పట్టణాల్లో, పల్లెల్లో ఆక్రమణలు ఊహించని రీతిలో పెరిగిపోయాయని తెలిపారు.

మినీ అంగన్‌వాడీలకు ప్రమోషన్లు

ముంచంగిపుట్టులో పత్రాలు చూపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: మండలంలోని 31 మంది మినీ అంగన్వాడీలకు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని యు.విమల కుమారి ప్రమోషన్ పత్రాలను గురువారం అందజేశారు. అనంతరం మండల ఎంపీడీవో ధర్మారావు, ఎంఈఓ కృష్ణమూర్తి చేతులమీదుగా స్మార్ట్ ఫోన్‌లను 237 మంది అంగన్వాడి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిడిపిఓ విమల కుమారి మాట్లాడుతూ, అంగన్వాడి కార్యకర్తలు విధుల పట్ల శ్రద్ధ చూపుతూ మొబైల్ యాప్‌లో వర్కులు చేయాలని సూచించారు. ఎంపీడీవో, ఎంఈఓలు మాట్లాడుతూ, అంగన్వాడి కార్యకర్తలు విధులను సక్రమంగా నిర్వర్తించాలని, సకాలంలో మొబైల్ యాప్ వర్కులు పూర్తి చేయాలని సూచించారు. అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు గంగా భవాని, ఈశ్వరి మాట్లాడుతూ, అంగన్వాడీలు గత ఏడాది నిరవధిక సమ్మె 42 రోజుల పోరాట ఫలితమే 31 మంది మినీలను మెయిన్ గా అప్‌గ్రేడ చేసి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మండలంలోని అర్ధాంతంగా నిలిచిపోయిన సెల్ టవర్లను వేగవంతం చేసి సిగ్నల్స్ సౌకర్యాలు అందించే విధంగా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు ఎస్.కొండమ్మ, ఎస్ రాజేశ్వరి, సిహెచ్ వరహాలమ్మ, స్వర్ణ, ఏపీఎం సిహెచ్ కళావతి, మండల వైస్ ఎంపీపీ1 సత్యనారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు, గిరిజ సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, అంగన్వాడి టీచర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెదబయలు: మినీ అంగన్వాడీ వర్కర్స్ 19 మందికి మెయిన్ అంగన్వాడీ వర్కర్స్ గా ప్రమోషన్లు పొందారు. పెదబయలు ప్రాజెక్ట్ అధికారిని స్రవంతి ఆధ్వర్యాన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొండ వరహాలమ్మా, సర్పంచ్ మాధవరావు, జడ్పీటీసీ, కె బొంజుబాబు, ఎంపీటీసీ బొంజుబాబు, ఎంపీడీఓ శ్యాం సుందర్, ఏ.ఓ, పూర్ణయ్య, టీడీపీ అధ్యక్షులు వెచ్చంగి కొండయ్య చేతుల మీదగా ప్రమోషన్ పత్రాలు అందజేశారు.

జి.మాడుగుల: అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం క్రమం తప్పకుండా ఇవ్వాలని ఎంపీపీ అప్పలరాజు తెలిపారు. జి.మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీవో కె.బి.చంద్రమణి దేవి, ఎంపీపీ అప్పలరాజు, తహసీల్దార్ రాజ్ కుమార్ అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లు అందజేశారు.మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చిన కార్యకర్తలకు నియామక పత్రాలను అందజేశారు.

హుకుంపేట: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో అంగన్వాడీ సేవల బలోపేతంపై చర్చించారు. ఐసిడిఎస్ సిడిపిఓ పూడి సువర్ణమ్మ మాట్లాడుతూ, మండలంలోని 49 మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో, ఎంఈవోలు పత్రాలను, 217 అంగన్వాడీ కేంద్రాలకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు.

హుకుంపేటలో ప్రమోషన్ పత్రాలతో అంగన్‌వాడీలు

నేరాలు ఘోరాలు

వంతెనను ఢీ కొన్న కారు

ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - హుకుంపేట: మండల కేంద్రంలోని రాళ్లగడ్డ సమీపంలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వంజంగికి వెళ్లి తిరిగి అరకు అందాలు చూసేందుకు గీతం ఇంజనీరింగ్ కాలేజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కారులో వస్తున్నారు. రాళ్లగడ్డ వంతెనను కారు బలంగా ఢీకొంది. పొగమంచు కారణంగా వంతెన స్పష్టంగా కనిపించక పోవడంతో కారు నేరుగా వంతెనను ఢీ కొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో గుడివాడకు చెందిన జి. రుద్ర సాయి (19) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీయన్ నిహార్ తలకు బలమైన గాయాలు కాగా, శ్రీనివాస్ కు రెండు కాళ్లు విరిగాయి. మరో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.తోటి ప్రయాణీకులు వెంటనే 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాడేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీయన్ నిహార్‌ను విశాఖ సెవెన్ హిల్స్ ఆసుపత్రికి తరలించారు.ఢీకొన్న కారు రహదారిపై అడ్డంగా ఉండిపోవడంతో కొంతసేపు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రుద్ర సాయి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాడేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారులో విద్యార్థి మృతదేహం

కైలాసగిరిపై ఎకో హైట్స్ ప్రాజెక్ట్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ విశాఖపట్నంలోని కైలాసగిరిపై ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో మరో భారీ పర్యాటక ప్రాజెక్ట్‌కు ఆమోదించినట్లు విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్‌గోపాల్, కమిషనర్ ఎన్.తేజ్ భరత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎకో హైట్స్ కాటేజీలు, 360 డిగ్రీల రివాల్వింగ్ ఫైన్-డైన్ రెస్టారెంట్, బే వ్యూ కేఫ్‌ల అభివృద్ధి' పేరుతో చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్ విశాఖ పర్యాటక రంగానికి కొత్త ఆకర్షణగా నిలవనుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను కైలాసగిరిపై విఎంఆర్‌డిఎకు చెందిన 1.99 ఎకరాల స్థలంలో సుమారు రూ.20 కోట్ల వ్యయంతో 18 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, గత నెల 29న జరిగిన అథారిటీ సమావేశంలో ఈ ప్రాజెక్ట్‌కు ఆమోదం లభించిందని వారు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో ముఖ్యంగా ఎకో హైట్స్ కాటేజీలు, నగరం, సముద్రం 360 డిగ్రీల దృశ్యాన్ని అందించే రివాల్వింగ్ రెస్టారెంట్, బే వ్యూ కేఫ్ నిర్మాణాలు ఉంటాయని వివరించారు. ఈ ప్రాజెక్టు ఎం/ఎస్ ట్రేజట్ ఇన్ఫ్రా లిమిటెడ్ సంస్థతో కలిసి పిపిపి విధానంలో ఉంటుందని తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

కేసుల పరిష్కారానికి 43 బెంచీలు ఏర్పాటు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు సూచనల మేరకు ఈ నెల 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి 43 బెంచీలు ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి న్యాయసేవా సదన్, న్యాయ సేవా అధికార సంస్థ గురువారం చిట్ ఫండ్ కంపెనీల ప్రతినిధులతో సన్యాసినాయుడు ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ లోక్ అదాలత్‌లో చెక్ బౌన్స్, ఇతర రాజీపడదగిన కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కరించేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. త్వరితగతిన, ఉచితంగా న్యాయం పొందడానికి జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆహ్లాదకరంగా విశాఖ బాలోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సెయింట్ ఆంథోనీ తెలుగు మీడియం ప్రైమరీ పాఠశాలలో జరుగుతున్న విశాఖ బాలోత్సవం- 2025 మూడవ రోజు గురువారం ఆహ్లాదకరంగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు ఉత్సాహంతో పాల్గొని బాలోత్సవ వేదికను రంగరించారు. పిల్లల్లో సృజనాత్మకత, చాతుర్యం, భాషా నైపుణ్యాలు, శాస్త్రీయ ఆలోచనలను వెలికితీయడంపై దృష్టి సారించే అంశాలపై పోటీలు నిర్వహించారు. బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ - వ్యర్థాలను ఉపయోగించి సమాజానికి ఉపయోగపడే వస్తువుల తయారీ, రైమ్స్, పద్యం భావవ్యక్తీకరణ, ఫైర్‌లెస్ కుకింగ్ (మంట లేని వంట), క్విజ్ (జూనియర్స్, సీనియర్స్) పోటీలు నిర్వహించారు. మొదటి రౌండ్ రాత పరీక్ష, రెండో రౌండ్ మౌఖికంగా నిర్వహణలో ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు సభ్యులతో బృందాలుగా పాల్గొన్నారు. సాంస్కృతిక విభాగంలో దేశభక్తి, జానపద, క్లాసికల్ నృత్యాలతో సందడి చేశారు. చిన్నారుల ఉత్సాహం వేదికను మరింత ప్రాచుర్యం పొందేలా చేసింది. ఈ బాలోత్సవం విద్యార్థులలో సమిష్టి తత్వం, సామాజిక అవగాహన, దేశభక్తి, పర్యావరణం పట్ల బాధ్యతను పెంచే విధంగా కార్యక్రమాలు రూపొందించడం హర్షించదగిన విషయం. చిన్నారులకు స్పాట్‌లో ఇచ్చిన కొన్ని సృజనాత్మక అంశాలు కూడా ఆకట్టుకున్నాయి. మట్టితో బొమ్మలు - జూనియర్స్ అంశం, 'పంట పొలం' చిన్న ప్రపంచం (పువ్వు-ఆకు-చెట్టు-పక్షి గూడు), తెలుగు మాట్లాడే కార్యకలాపాలు, చిన్నారుల ప్రతిభను ప్రతిబింబించే కోలాటం, ఫ్యాన్సీ డ్రెస్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విశాఖ బాలోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడానికి పాఠశాలల సహకారం, ఉపాధ్యాయుల సమన్వయం, చిన్నారుల ప్రతిభ కలిసి చిరస్మరణీయ వాతావరణాన్ని సృష్టించాయి.

నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

పాఠశాలకు కుర్చీల వితరణ

పాఠశాలకు కుర్చీలు వితరణగా ఇస్తున్న కిలో నింది

ప్రజాశక్తి-సీలేరు : జికె వీధి మండలం చింతపల్లి క్యాంప్‌లోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు కిలో నింది అనే వ్యక్తి పది కుర్చీలు వితరణగా ఇచ్చారు. ఈ స్కూల్లో ఒకటి నుంచి ఐదు తరగతి వరకు 49 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఉపాధ్యాయులు భగీరధ, ప్రసాదరావు విద్యను బోధిస్తున్నారు. ఇటీవల డిప్యూటేషన్ ప్రాతిపదికన ప్రసాద్‌రావు దుప్పిలివాడ పంచాయతీ వలసపల్లి ఎంపీపీ స్కూలుకు నియమించారు. ప్రస్తుతం భగీరథతో పాటు భాషా వాలంటీరు నాగమణి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. తల్లిదండ్రులు సమావేశం నిర్వహించినప్పుడు పాఠశాలలో కుర్చీలు లేక అనేక ఇబ్బందులు గురవుతున్నారు. సమస్యను గుర్తించి పాఠశాలకు కుర్చీలు వితరణగా ఇవ్వాలని నింది నిర్ణయించుకున్నాడు. అదే పాఠశాలలో నింది పిల్లలు విద్యాభ్యాసం పొందుతుండడంతో ఈ మేరకు పాఠశాలకు 10 కుర్చీలు అందజేశారు. ఉపాధ్యాయులు భగీరథ, భాషా వాలంటీర్ నాగమణి నిందిని అభినందించారు.

ఐద్వా నేత అన్నపూర్ణ మృతికి సంతాపం

అన్నపూర్ణ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ సీనియర్ నాయకులు వి.కృష్ణమూర్తి సతీమణి ఐద్వా నేత, సిపిఎం సభ్యురాలు వి. అన్నపూర్ణ బుధవారం రాత్రి అకాల మరణం పొందారు. అన్నపూర్ణ మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, బలరాం, సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గసభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, వి.కృష్ణారావు, ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ పూర్వ మేనేజర్ ఎస్. సుధాకర్, ఐద్వా రాష్ట్ర నాయకులు బి. పద్మ. 78వవార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ తదితరులు అన్నపూర్ణ మృతికి సంతాపాన్ని తెలిపారు. అన్నపూర్ణ కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు. ఒక్క నిమిషం మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా సిహెచ్. నరసింగరావు మాట్లాడుతూ అన్నపూర్ణ, కృష్ణమూర్తి సిపిఎంలో చేరి ఆరిలోవ ప్రాంత ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేసారన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో కృష్ణమూర్తి పూర్తికాలం కార్యకర్తగా పనిచేసారని,. ఆయన అడుగుజాడల్లో అన్నపూర్ణ స్థానికంగా పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణానికి మంచి సేవలందించారన్నారు. ఇద్దరూ చివర వరకు పార్టీతో ఉండి అంకితభావంతో ప్రజాసేవ చేసారన్నారు. అన్నపూర్ణ ఆశయాలు కొనసాగిస్తామన్నారు. స్థానిన నాయకులు వి.నరేంద్రకుమార్, పి.శంకర్, బి. సూర్యమణి, నాగరాజు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) మండల కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మండల కమిటీ ఎన్నికైంది. సమావేశానికి ఎన్నికల అధికారిగా జి.విశ్వరాజు, పరిశీలకులుగా కె.ఆదిరెడ్డి వ్యవహరించారు. అతిథులుగా రంపచోడవరం జిల్లా కార్యదర్శి కె.సూరిబాబు, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సనాతన్ బాబు, ఎన్. వెంగలరావు, దేవీపట్నం ప్రధాన కార్యదర్శి చిన్నిబాబు హాజరై సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ బలోపేతం, విద్యారంగ అభివృద్ధి, మండల స్థాయి సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అనంతరం మండల కమిటీ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా బి ఆంజనేయ రెడ్డి, అధ్యక్షులుగా కే పండయ్య, సహాధ్యక్షులుగా ఎస్ సాల్మన్ బాబు, ప్రధాన కార్యదర్శిగా కే కృష్ణారెడ్డి, కోశాధికారిగా పి రమేష్, పత్రిక కార్యదర్శిగా వి.అబ్బాస్, కార్యదర్శులుగా డి చంద్రశేఖర్, పి జ్యోతిలక్ష్మి, ఎస్ జయ లక్ష్మి, ఈ లింగారెడ్డి, పి గంగాధర్, రమేష్, జి నిర్మలాదేవి ఎన్నికయ్యారు.

అమర వీరులకు నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

సౌత్‌జోన్ మహిళల టేబుల్ టెన్నిస్ విజేత జైన్ వర్సిటీ

పతకాలు, ప్రశంసాపత్రాలతో విజేతగా నిలిచిన జైన్ వర్సిటీ క్రీడాకారులు

ప్రజాశక్తి-మధురవాడ : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయు) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న సౌత్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్ టెన్నిస్(పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్ పోటీలలో తమిళనాడుకు చెందిన పలు విశ్వవిద్యాలయాల జట్లు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. ఫైనల్స్‌లో తమిళనాడుకు చెందిన ఎస్‌ఆర్‌ఎమ్ విశ్వవిద్యాలయంపై కర్ణాటకకు చెందిన జైన్ విశ్వవిద్యాలయం 3-2 స్కోరుతో విజయం సాధించి సౌత్ జోన్ ఛాంపియన్‌గా నిలిచింది. ఎస్‌ఆర్‌ఎమ్ విశ్వవిద్యాలయం రన్నరప్‌గా నిలిచింది. తమిళనాడుకు చెందిన అన్నా విశ్వవిద్యాలయం మూడవ స్థానంలో, మద్రాస్ విశ్వవిద్యాలయం నాలుగవ స్థానాలలో నిలిచాయి. పోటీలలో విజేతలైన జట్లు తెలంగాణాలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే ఏఐయు అఖిల భారత మహిళల టిటి ఛాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించాయి.

ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ సభకు గీతం ప్రో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పాల్గొని విజేతలను అభినందించి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో గీతం కేంపస్ లైఫ్ అసోసియేట్ డీన్ అరుణ్‌కార్తీక్, గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరక్టర్ జి. శ్రీనివాస్, గీతం క్రీడా విభాగం సీనియర్ మేనేజర్ కె.తపశ్వి, ఎస్.రితేష్ పాల్గొన్నారు. ఈ పోటీలలో క్రీడాకారిణులు అత్యున్నత స్థాయి ప్రతిభను కనబరిచారని విశాఖపట్నం టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ డివిఎస్‌వై. శర్మ తెలిపారు.

కెరీర్ ఎదుగుదలకు కృత్రిమ మేధను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి-మధురవాడ : సాంకేతిక పరిజ్ఞానం ఏదైనా చివరికి కృత్రిమ మేధ (ఎఐ) సైతం మానవ మేధస్సుకు సరిరాదని అశోకా విశ్వవిద్యాలయం విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ డాక్టర్ ధీరజ్ సంఘ్వీ అన్నారు. అయితే ఛాట్ జిపిటి వంటి కృత్రిమమేధ ఉపకరణాలను యువత గుడ్డిగా అనుసరించకుండా కెరీర్ ఎదుగుదలకు ఉపయోగించుకోవడ మెలాగో నేర్చుకోవాలని సూచించారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతూ, ఏ కోర్సు చదివినా అందులో మూల సూత్రాలపై అవగాహన, పట్టు సాధించినప్పుడే కృత్రిమ మేధ, కాలిక్యులేటర్ ఏదైనా ఎలా ఉపయోగించుకోవాలో తెలుస్తుందన్నారు. నవతరం కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి ఆధునిక శాస్త్రాలను లోతుగా అర్థం చేసుకుని నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. గుడ్డిగా వీటిని నమ్మడం సరికాదన్నారు.

గీతం ప్రోవైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ సవాళ్ళను ఎదుర్కొని లక్ష్యాలను చేరుకునే సమర్థత, క్రమశిక్షణ నేటి యువత అలవరచుకోవాలన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ అనంతరామకృష్ణ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానాన్ని సరైన రీతిలో అర్థం చేసుకున్నప్పుడే సమాజానికి ఉపయోగపడే నృతహాగా అభివృద్ధి చేయగల నేర్పు యువతకు అలవడుతుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి టి.ఉమాదేవి మాట్లాడుతూ, కంప్యూటర్ రంగంలో సరికొత్త ఒరవడి సృష్టించిన శాస్త్రవేత్త డాక్టర్ గ్రేస్ హెూప్పర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, విజయనగరంలోని వివిధ కళాశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సందేహాలను ముఖ్యఅతిథి నివృత్తి చేశారు.

డాక్టర్ ధీరజ్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత

ప్రజాశక్తి కథనానికి స్పందన

ఇంకుడు గుంత ఏర్పాటును పర్యవేక్షిస్తున్న స్కూల్ కమిటీ చైర్మన్ శరభన్న దొర

ప్రజాశక్తి-జికె.వీధి : మండలంలోని రింతాడ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో వంటగది ఆవరణలో కనీసం ఇంకుడు గుంత లేక మురుగు నీరుతో దుర్గంధం వెదజల్లుతుందని ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి పాఠశాల యాజమాన్యం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మొట్టడం శరభన్నదొర స్పందించారు. గురువారం ఉదయం పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు, పిల్లలు తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందికి అభినందనలు తెలిపారు.

అపరిచిత వ్యక్తుల సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో అనుమానస్పదంగా అపరిచిత వ్యక్తులు కంచరిస్తే తమకు సమాచారం అందజేయాలని స్థానిక ఎస్సై యాసీన్ కోరారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వివిధ వ్యాపారాల నిమిత్తం వస్తు తాళాలు వేసి ఉన్న ఇళ్లను ఇతర వస్తువులు గమనిస్తారని తెలిపారు. అటువంటి వ్యక్తులపై ఎవరికైనా అనుమానం కలిగితే వెంటనే పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్కు 9440904234 సమాచారం చేరవేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్ఐ యాసీన్

150 మందికి అన్నదానం

ప్రజాశక్తి-సీలేరు : ఏపీ జెన్కో రిటైర్డ్ ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి గురువారం 150 మందికి అన్నదానం చేశారు. జీకే వీధి మండలం సీలేరు కాంప్లెక్స్‌లోని ఏపీ జెన్కో ఎస్ఇ సివిల్‌గా పని చేసిన చంద్రశేఖర్‌రెడ్డి గత నెల 30న ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు దైవ భక్తి ఎక్కువ. స్థానిక దేవాలయాల్లో దైవ కార్యక్రమాలు జరిగినప్పుడు తమవంతు సహాయంగా విరాళాలు ఇచ్చేవారు. ఇందులో భాగంగా పేదలకు అన్నదానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు స్థానిక సాయిబాబా కమిటీ నాయకులు పిల్ల సాంబమూర్తి ఆధ్వర్యంలో రామాలయం సెంటర్ సీతారాముల కళ్యాణ మండపంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముందు చంద్రశేఖర్ రెడ్డి సాయిబాబా రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు 5జి ఫోన్లు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 108 అంగన్వాడీ కేంద్రాలకు 5జీ శామ్‌సంగ్ సెల్ ఫోన్లు వచ్చాయని ఐసిడిఎస్ సీడీపీఏ సుజాత గురువారం తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ ఆన్లైన్ పనులు వేగవంతంగా పూర్తి అవ్వడానికి 5జీ ఫోన్లు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. పాత ఫోన్లు తీసుకొని కొత్తవి ఇవ్వనున్నట్లు సిడిపిఓ పేర్కొన్నారు.